# దారిలో దొరికిన ప్రేమలేఖలు



## – ???

*ఎవరు వ్రాశారో తెలియదు, ఎవరికి వ్రాశారో తెలియదు. దొరికిన ప్రేమలేఖల సంపుటినుంచి నెలకో ప్రేమలేఖ !!*

## – 9–

**నేస్తమా..**

గంటలు రోజులు నెలలుగా నెలలు సంవత్సరాలుగా మారిపోతున్నాయి. అవునూ..అసలీ జీవితాన్ని నేనేం అర్థం చేసుకున్నానూ? పుట్టడం అనేది ఓ మహాభారత యుద్ధం. 80 మిలియన్ కౌంట్ వుంటేగానీ వీర్యంలో, పిల్లలు పుట్టరుట. ఓ మిలియన్ అంటే పదిలక్షలు. 80X10,00000 = లెక్కపెట్టు. ఇన్ని కోట్ల 'బీజాలు' లోపలికి వెళ్ళి అక్కడున్న 'అండం'తో కలిసే ప్రయత్నం చేస్తే, ఒక్కటంటే ఒక్కటో, లేక రెండో, అరుదుగా మూడో బీజాలు మాత్రమే ఆ అండాన్ని దక్కించుకోగలవట. ఒక్కటే బీజం అండాన్ని దక్కించుకుంటే ఆ అండం పిండంగా మారి నేను పుట్టాను. నాలానే నువ్వూ అందరూ కూడా.



అంటే, కోటానుకోట్ల సజీవ బీజాల్ని ఓడిస్తే తప్ప నాకీ శరీరం దక్కలేదన్నమాట. నిజం చెబితే ఓ మహాభారత యుద్ధం చేసి కోటానుకోట్ల మందిని ఓడిస్తేగానీ యీ శరీరం దక్కలేదు. అంటే, ప్రతిజీవీ కూడా పుట్టుకతోనే 'విజయుడు'.

తొమ్మిదినెలలు తల్లి గర్భంలో వుండి, ఆ చోటు ఇరుకైపోతే కాలం తల్లిశ్వాసే మనశ్వాస.. తల్లి తిన్న ఆహారమే మనకీ ఆహారం. బయటి కొచ్చిన తరవాత బొడ్డుతాడుని కట్ చేసిన మరుక్షణం, మనశ్వాస మనమే పీల్చుకోవాలి. మన ఆహారం మనమే తీసుకోవాలి. అంటే, పుట్టుకతోనే మనం సర్వస్వతంత్రులమయ్యాం.

ఎంత విచిత్రం...

పుట్టకముందే విజయులం.

పుట్టిన మరుక్షణమే సర్వస్వతంత్రులం.

తల్లీతండ్రీ మనని, వారి సుఖాల్ని త్యాగం చేసి పెంచుతారు. గనక వారు మనకి దైవసమానులయ్యారు. (ఔతారు) ఇహ గురువులు. వారు నేర్పకపోతే మనకీలోకం ఎలా తెలుస్తుంది? ఎలా అర్థమవుతుంది?

ప్రియమిత్రమా, ఏదేదో నేర్చుకున్నా, ఎలాగో పెరిగాను. ఇంతవాడ్నయ్యాను. కానీ, చిన్నారీ ఇప్పుడు, యీ క్షణాన ఎన్ని ఆలోచనలొస్తున్నయ్యో చూశావా! ఎంత కష్టపడి పాకటం నేర్చుకున్నానూ.! ఎన్నిసార్లు పడీపడిపడీపడీ లేచి నిలబడగలిగాను. ఎంత కష్టపడి నడవగలిగాను. ఎంత సాధన చేస్తే పరుగులెత్తగలిగానూ! అక్షరాలు కూడబలుక్కుని పుస్తకాల్ని మస్తకానికెక్కించుకున్నా. కంటికి కనపడని మనోగాయాలనీడల్లో లోకాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేశాను. చేస్తున్నాను.

కానీ ప్రియా.. కాలం ఎంత దొంగది! నాకు తెలీకుండానే నా బాల్యాన్ని దొంగిలించేసింది. ఎప్పుడో నాకు అసలు తెలీకుండానే యవ్వనాన్నీ చోరీ చేస్తుంది. కానీ, ఆలోపులోనే నన్ను నేను నీకు సమర్పించుకోవాలి.

'నేను' అన్న భావం నన్ను నిలబెట్టింది. ఉద్యోగాలు చేయించింది. డబ్బు సంపాయించే మార్గాలు చూపింది. ఆస్తులూ అంతస్తులు కూడబెట్టే పద్ధతులెన్నింటినో నేర్పింది. కానీ ప్రాణమా, 'నిజాన్ని' మాత్రం నానుంచి దోచేసింది.

ప్రతిక్షణం ఓ శూలమే.

జీవితాన్ని హరించేదే

మృత్యువువైపు మనిషిని తోసివేసేదే

పోనీ, యీ సంపాదించినదంతా కూడా వస్తుందా? రాదే! మరి ఎందుకీ సంపాదించాలనే వెర్రితనం? Why do you collect when you can't carry?

తీసుకెళ్ళలేని వాటిని పోగు చెయ్యడం ఎందుకూ? పోనీ తృప్తినిస్తాయా అంటే అదీలేదు. ఎంత పెంచుకున్నా తృప్తి కలగదు. చిల్లుకుండలో నీరు నింపటంలాంటిదే, యీలోకంలో కూడబెట్టడం!

ఎక్కడెక్కడో తిరిగాను. ఏదేదో చేశాను. ఎందరెందర్నో కలిశాను. ఎన్ని పుస్తకాల్నో చదివాను. ఏది చేసినా మనసు 'ఆకలి' తీరదేం?

గురునానక్ అన్నారట, "ప్రభూ, యీలోకంలో ఎన్ని సుందరదృశ్యాలు చూసినా కంటి ఆకలి తీరలేదు. ఎంత అద్భుతమైన సంగీతం విన్నా 'చెవుల' ఆకలీ తీరలేదు. అబ్బా.. ఎన్ని సువాసనల్ని చూసినా ముక్కు ఆకలి తీరలేదు. ఎన్ని రుచికరమైన పదార్థాలని తిన్నా నోటి (నాలుక) ఆకలి తీరలేదు. ఎన్ని సుందరమైన వాటిని కౌగిలించినా తనువు ఆకలీ తీరలేదు. వెతికి వేసారిపోయాం.. నా ఆకలి ఎలా తీరుతుందా అని. చివరికి కనుక్కోగలిగాను ప్రభూ.. నాకనుల ఆకలి నీ రూపం చూసినప్పుడు మాత్రమే ఉపశమించింది. నా చెవుల ఆకలి నీనామాన్ని విన్నప్పుడే తగ్గింది. నానోటి ఆకలి నీ నామస్మరణ చేసినప్పుడే తొలగింది. ఓ భక్తవత్సలా నీ పేరు అమృతతుల్యం .. నీ రూపమూ, నామమే పరిమళభరితం. కేవలం నా ఇంద్రియాల ఆకలేకాదు పురుషోత్తమా, నిరంతర నామస్మరణలో నా మనసు ఆకలి కూడా తీరింది. ఎంత మాయావివి. ఇప్పుడు గదా, 'నాలో వున్న నిన్ను' కనుగొన్నది!" అన్నారట.

ప్రియాతిప్రియమైన నేస్తమా -

ఒక్కమాట.. నా అంతరాంతరంగంలోని ఒక్కమాట ఒక్కమాట.. నా అంతరాంతరంగంలోని ఒక్కమాట చెప్పనా.! గురునానక్ ఆకలి పరమేశ్వర నామస్మరణతో తీరినట్టు, నా మనస్సులోని ఆకలి.. నిన్ను చూస్తేకానీ తీరదు. నీ మధురమైన మాటలు వింటేగానీ నా చెవుల ఆకలి తీరదు. నీ మృదువైన స్పర్శతోగానీ నా తనువు ఆకలి తీరదు. నా నాశిక ఆకలి తీర్చగల పరిమళం నిస్సందేహంగా నీ తనూపరిమళమే!

ఇంకేం చెప్పనూ. దైవాన్ని ఎవరన్నా చూశారో లేదో నాకు తెలీదు గానీ 'ప్రేమ' మాత్రం నిజంగా దైవమే. ఎందుకంటే ఆ ప్రేమ స్వరూపానివి నువ్వేగా!



నీ

-X-

*(వచ్చేనెల మరో ప్రేమలేఖ)*

Post your comments